ప్రధాని, అదానీపై కాంగ్రెస్ ఆందోళన

రేపు చలో రాజ్‌భవన్

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): గౌతమ్ అదానీ ఆర్థిక అవకతవకలతో దేశ ప్రతిష్ఠ దిగజారినా ప్రధాని మోదీ స్పందించడం లేదని కాంగ్రెస్ అధిష్ఠానం విమర్శలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలు నిరసనలకు పిలుపునిచ్చారు. ఇందులోభాగంగానే టీపీసీసీ కూడా బుధవారం చలో రాజ్‌భవన్‌కు పిలుపునిచ్చింది. ఈ ర్యాలీలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

పీడీఎస్ బియ్యం ఎటుపోతున్నాయ్

మండలి చైర్మన్ గుత్తా

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం రూ.3.7లక్షలుగా గణాంకాలు చెప్తుంటే.. రాష్ట్రంలో పేదరికం ఎక్కడ ఉన్నదని గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సోమవారం మండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా కొత్త రేషన్‌కార్డుల పై చర్చ జరిగింది. చైర్మన్ గుత్తా స్పందిస్తూ.. ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం పేదలకు దుత్తున్నాయా? లేక కాకినాడ పోర్టుకు వెళ్తున్నాయా?' అని అనుమానం వ్యక్తంచేశారు.

చేనేతకు రీయింబర్స్‌మెంట్ ఏదీ?

- జగిత్యాలలో పట్టు పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి
- బీసీల విదేశీవిద్యకు నిధులేవి?
- ఇన్నిసార్లు ఢిల్లీ వెళ్లి రాష్ట్రానికి సీఎం ఏం సాధించారు?
- శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీ పన్నును రీయింబర్స్ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు ఎక్కడివరకు వచ్చిందో చెప్పాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా చేనేతలకు జీఎస్టీ రీయింబర్స్ కోసం మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయలేదని విమర్శించారు. సోమవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. జగిత్యాలలో పట్టు పురుగుల పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. 16కోట్లు కేటాయించినప్పటికీ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వానికి ఆసక్తి లేకపోవడం శోచనీయమని వాపోయారు. గతంలో రాష్ట్రంలో లేని పట్టుగూళ్ల సాగు(మల్బరీ సాగు) కేసీఆర్ హయాంలో 13 వేల ఎకరాలకు పెరిగిందని గుర్తు చేశారు. రూ.8 కోట్ల పట్టుగూళ్ల బకాయిలను చేనేతలకు వెంటనే చెల్లించాలని కోరారు. సెరికల్చర్ శాఖలో 650 ఉద్యోగాలకు 400మంది రిటైర్ అయ్యారని, వారి స్థానంలో కొత్తవారిని నియమించాలని కోరారు. ఆసిఫాబాద్, భద్రాచలం వంటి గిరిజన ప్రాంతాల్లో తేనెటీగల కాలనీలను ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ల స్ఫూర్తిని దెబ్బతీయవద్దని పేర్కొన్నారు. కొన్ని పోస్టులకు డీరిజర్వేషన్ చేయడం సరికాదని మండిపడ్డారు.

బీసీల విదేశీ విద్యకు నిధులు ఇవ్వరా?

పెద్ద పెద్ద కాంట్రాక్టర్లకు రూ.10 వేల కోట్లు బిల్లులు చెల్లించామని ప్రభుత్వమే చెబుతుందని, అలాంటిది బీసీ విద్యార్థులకు ఎందుకు విదేశీ విద్య నిధులు ఇవ్వడం లేదో చెప్పాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. గురుకులాల్లో నూతన డైట్ మెనూ ఎప్పటి నుంచి అమలు అవుతుందో స్పష్టం చేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో గురుకులాల నాణ్యత కూడా పడిపోయిందని మండిపడ్డారు. ప్రతీ రోజూ ఎక్కడో ఒక చోట ఫుడ్ పాయిజన్ కేసు నమోదవుతున్నదని ప్రస్తావించారు. విషాహారం తిని 53మంది విద్యార్థులు చనిపోయారని, మరణించిన వారి కుటుంబాలకు నష్టపరిహారం ఇస్తారా..? ఇవ్వరా అన్నది ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని నిలదీశారు. కేసీఆర్ హయాంలో ఏడాదికి 27 గురుకులాలు ఏర్పాటయ్యాయని, కానీ రేవంత్ హయాంలో ఒక్కటి కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. గతంలో కేవలం 19 బీసీ సంక్షేమ పాఠశాలలను ఏర్పాటు చేస్తే.. పదేండ్లల్లో కేసీఆర్ 275 బీసీ పాఠశాలలను, 31 బీసీ డిగ్రీ కాలేజీలను, ప్రత్యేకంగా బీసీలకు రెండు వ్యవసాయ కాలేజీలను ఏర్పాటు చేశారని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసిందని తెలిపారు. చేనేతలకు రూ.1200కోట్లు, యాదవులకు రూ.5 వేల కోట్లు, 67వేల మంది గౌడన్నలకు పెన్షన్ ఇచ్చామని వివరించారు. 2230 బీసీ విద్యార్థుల విదేశీ విద్యకు రూ.450 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు.

రేవంత్ ఢిల్లీకి వెళ్లి ఏం సాధించారు?

నెలకు రెండుమూడు సార్లు ఢిల్లీకి వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రులను కలిశారని, మరి ప్రతి జిల్లాకు రావాల్సిన నవోదయ విద్యాలయాలను ఎన్ని సాధించారు? అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాలను ఎన్ని గుర్తించారు? వెనుకబడిన జిల్లాలకు నిధులు సాధించారా?అన్నది ప్రభుత్వం చెప్పాలని నిలదీశారు. ఇన్ని సార్లు ఢిల్లీ వెళ్లడమే కాకుండా కేంద్ర ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి అదనపు నిధులు ఏం తీసుకొచ్చిందని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు.

చేనేత కుటుంబాలను ఆదుకోవాలి: ఎమ్మెల్సీ ఎల్ రమణ

ఆర్థిక ఇబ్బందులతో చాలా మంది చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని, బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్సీ ఎల్.రమణ కోరారు. గత ప్రభుత్వ హయాంలో నేతన్న బీమా పథకం ద్వారా ఆదుకున్నామని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ ఏడాది కాలంలో 28 మంది ఆత్మహత్య చేసుకోగా, బాధిత కుటుంబాలకు న్యాయం జరగలేదని సభలో పేర్కొన్నారు. గతంలో చెప్పినట్టుగా చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు పింఛన్ అందించాలని కోరారు. చేనేత కార్మికుల రుణమాఫీ చేయడంతో పాటు రాహుల్ గాంధీ హామీనిచ్చిన జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

సుదీర్ఘ ఉపన్యాసాలొద్దు : స్పీకర్

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) :సభలో ప్రశ్నోత్తరాలకు గంట సమయం కేటాయించినట్టు ప్రతిరోజూ 10 ప్రశ్నలుంటాయని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. సోమవారం అసెంబ్లీ ప్రారంభం కాగానే సభలో ప్రకటన చేశారు. ప్రశ్నోత్తరాలను దృష్టిలో ఉంచుకొని సభ్యులు సుదీర్ఘ ఉపన్యాసం చేయరాదని, కేవలం ప్రశ్నలకే పరిమితం కావాలని, మంత్రులు సైతం సభ్యులడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానాలివ్వాలని, ఎజెండా ముందుకు సాగేందుకు సభకు పూర్తిగా సహకరించాలని కోరారు.

జీపీలకు నిధుల్లేవు : మల్‌రెడ్డి

రాష్ట్రంలోని పంచాయతీలకు అధికారాలు, హక్కులు, నిధులులేవని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి విమర్శించారు. కనీసం బల్బుపోతే వేసుకోలేని దుస్థితిలో జీపీలు ఉన్నాయని వాపోయారు. మండల కేంద్రాల్లో నాలుగులేన్ల రహదారి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ కోరారు.

ఫిర్యాదు చేసినా చర్యల్లేవ్: అనిరుధ్‌రెడ్డి

కాలుష్యకారక పరిశ్రమలపై ఫిర్యాదు చేసినా పీసీబీ పట్టించుకోవడం లేదని జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో ముదిరెడ్డిపల్లి చెరువు కాలుష్యంపై ఆయన ప్రశ్నించారు. పోలేపల్లి సెజ్‌లో అమాన్యుల్, అరబిందో ఫార్మా సంస్థల కాలుష్యంపై నివేదిక కోరతామన్నారు.

'పర్యాటకం' తీర్చిదిద్దాలి : ఎమ్మెల్యేలు

పలు దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలతో కూడిన నల్లమలను టూరిస్ట్ హబ్‌గా తీర్చిదిద్దాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, నేనావత్ బాలూనాయక్, మల్‌రెడ్డి రంగారెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

334 గ్రామాలకు బీటీ రోడ్లులేవు : సీతక్క

రాష్ట్రంలో 334 పంచాయతీలకు బీటీ రోడ్లు లేవని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అసెంబ్లీలో వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 12,941 గ్రామ పంచాయతీలుంటే, 12,607 పంచాయతీలకు రోడ్లు ఉన్నాయని ప్రశ్నోత్తరాల సమయం లో ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, నేనావత్ బాలూనాయక్, మల్‌రెడ్డి రంగారెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

బీఆర్ఎస్ ఇచ్చిన రేషన్‌కార్డులు 6.47 లక్షలు

- 20.69 లక్షల మందికి లబ్ధి
- మండలిలో మంత్రి ఉత్తమ్
- పదేండ్లలో ఒక్క కార్డూ ఇవ్వలేదంటూ బీఆర్ఎస్‌పై విమర్శలు
- సంక్రాంతి తర్వాత కొత్తవి ఇస్తామంటూ ప్రకటన
- ఇంకా దరఖాస్తులే స్వీకరించలేదని తాజాగా స్పష్టీకరణ

హైదరాబాద్, డిసెంబర్ 16(నమస్తే తెలంగాణ): 'పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ సర్కారు ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదంటూ ఇంతకాలం కాంగ్రెస్ చేసిన ప్రచారమంతా అబద్ధమేనని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శాసనమండలిలో తేల్చేశారు. సోమవారం శాసనమండలిలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం కోదండరాం కొత్త రేషన్‌కార్డులపై అడిగిన ప్రశ్నకు మంత్రి ఉత్తమ్ సమాధానమిచ్చారు. 2016 నుంచి 2023 వరకు కొత్తగా 6,47,479 రేషన్‌కార్డులను గత ప్రభుత్వం జారీ చేసిందని వెల్లడించారు. తద్వారా 20.69 లక్షల మంది లబ్ధిపొందినట్టు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 89.95 లక్షల తెల్ల రేషన్‌కార్డులు, 2.81 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారని వివరించారు.

కొత్త కార్డులు ఇప్పట్లో లేనట్టే!

బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదంటూ ఇంతకాలం అబద్ధాలను ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా కొత్త కార్డుల జారీపై మీనమేషాలు లెక్కిస్తున్నది. అధికారంలోకి రాగానే కొత్త కార్డులు జారీ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడంతో పేదలు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. వారి ఆశలను అడియాశలు చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు కొత్తగా సంక్రాంతి తర్వాత ఇస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. అయితే, ఇప్పటివరకు కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి దరఖాస్తులే స్వీకరించలేదని తెలిపారు. రేషన్‌కార్డులపై ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక ఎప్పటిలోగా ఇస్తుందో కూడా స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో కమిటీ నివేదిక ఇచ్చేదెప్పుడు, దరఖాస్తులు స్వీకరించేదెప్పుడు, కొత్త కార్డులు జారీ చేసేదెప్పుడు అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

సంక్రాంతి తర్వాత కొత్త తెల్ల రేషన్‌కార్డులు

శాసనమండలిలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తేతెలంగాణ): సంక్రాంతి తరువాత కొత్త తెల్లరేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను మొదలు పెట్టబోతున్నట్టు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. సోమవారం ఉదయం రాష్ట్ర శాసన మండలిలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఆచార్య కోదండరాంరెడ్డి, మీర్జా రియాజుల్ హసన్ ఏఫెండిలతో పాటు జీవన్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 6,47,479 రేషన్‌కార్డులను గత ప్రభుత్వం జారీ చేసిందని వెల్లడించారు. కొత్తగా పది లక్షల కొత్త రేషన్‌కార్డుల మంజూరు ఉండవచ్చని సభకు వివరించారు. తద్వారా 31లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని ఆయన చెప్పారు. కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు కులగణన సర్వేను ఆధారం చేసుకుంటామని తెలిపారు. కొత్త కార్డుల మంజూరుతో ప్రభుత్వంపై అదనంగా రూ.956 కోట్ల భారం పడుతుందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానంలో స్మార్ట్‌కార్డులు జారీ చెయ్యబోతున్నట్టు ఆయన వెల్లడించారు. కొత్తకార్డుల అర్హతా ప్రమాణాలను నిర్ణయిస్తూ మంత్రివర్గ ఉపసంఘం సిఫారసులను క్యాబినెట్ ముందుంచినట్టు తెలిపారు. ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాల డీలర్ల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు.

జాబ్ క్యాలెండర్ ప్రకారమే నోటిఫికేషన్లు

డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): జాబ్ క్యాలెండర్ ప్రకారమే నోటిఫికేషన్లు విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఉద్యోగాల ఖాళీలు అంచనా వేసి టీజీపీఎస్సీ ద్వారా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. శాసనమండలిలో సోమవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా బీఆర్ఎస్ సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, తాతా మధు, అనిల్ రెడ్డి, కాంగ్రెస్ సభ్యులు టీ జీవన్‌రెడ్డి, బల్మూర్ వెంకట్ తదితరులు అడిగిన ప్రశ్నకు డిప్యూటీ సీఎం సమాధానమిచ్చారు. ఉద్యోగాల భర్తీ కోసమే జాబ్ క్యాలెండర్ ప్రకటించామని దశలవారీగా భర్తీ చేస్తున్నామని ఆయన వెల్లడించారు. కాగా, రేవంత్ రెడ్డి సర్కారు గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఖాళీల వివరాల్లేని.. నోటిఫికేషన్, పరీక్షల తేదీల్లేని జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉసూరుమనిపించిందని విపక్ష సభ్యులు విమర్శించారు.

అటవీ ప్రాంతాల్లోని రైతులు జాగ్రత్త

మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తేతెలంగాణ): అటవీ ప్రాంతాల్లోని రైతులు, సామాన్య ప్రజలకు కొన్ని ప్రత్యేక సూచనలు చేసినట్టు రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మాత్రమే పొలాల్లో పనులు చూసుకోవాలని సూచించారు. సోమవారం ఆమె శాసనమండలిలో పలువురి సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. వన్యమృగాల దాడిలో చనిపోయిన వారికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి 10లక్షలకు పెంచినట్టు వివరించారు.

బీసీ కులాల అభివృద్ధికి కృషి

మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తేతెలంగాణ) : బీసీ కులాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీని కోసమే కుల గణన చేస్తున్నామని, దానికి అనుగుణంగా రిజర్వేషన్లు ఇవ్వాలని ఆలోచన చేస్తున్నామని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి ప్రభాకర్ సమాధానమిచ్చారు. బీసీ సంక్షేమానికి, కేటాయించిన నిధుల్లో రూ.2వేల కోట్లు విడుదల చేశారని, వాటిలో రూ.800 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు.

నేను లెక్కల్లో వీక్!

శాసనమండలిలో సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్య సభలో నవ్వులు పూయించింది. 'రాష్ట్రంలో 54 ఇంటిగ్రేటెడ్‌లలో 4 చొప్పున 116 గురుకులాలు ఏర్పాటు చేస్తున్నాం అనడంతో తక్కెళ్లపల్లి రవీందర్ స్పందిస్తూ.. 116 కాదు.. 216 అవుతాయి. దీంతో 'నేను లెక్కల్లో వీక్.. మీరు చెప్పిందే కరెక్ట్' అంటూ మంత్రి సమాధానాన్ని కొనసాగించారు.

మా వల్లే పారపాటు జరిగింది

- బీఆర్ఎస్ నేత దుకాణాలను 2వారాల్లో తిరిగి నిర్మిస్తాం
- పంచాయతీ కార్యదర్శుల లిఖితపూర్వక హామీ

దోమలపెంట, డిసెంబర్ 16 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట బీఆర్ఎస్ మాజీ ఉప సర్పంచ్ కటకం మహేశ్, కటకం నాగలక్ష్మికి చెందిన దుకాణాలను పొరపాటున కూల్చి వేశామని, వాటిని తిరిగి నిర్మించి ఇస్తామని దోమలపెంట, మన్ననూరు పంచాయతీ కార్యదర్శులు హామీపత్రం జారీ చేశారు. 'ఈ నెల 11న కటకం మహేశ్, కటకం నాగలక్ష్మి దుకాణాలను మా పొరపాటు కారణంగా తొలగించాం. వాటిని తమ సొంత ఖర్చులతో రెండు వారాల్లోగా పునర్నిర్మించి ఇస్తాం. కోర్టు ఉత్తర్వులకు లోబడి ఉంటాం అని హామీ ఇస్తూ సంతకం చేస్తున్నాం' అంటూ దోమలపెంట, మన్ననూరు పంచాయతీ కార్యదర్శులు జయంత్, భీముడు లిఖిత పూర్వకంగా రాసిచ్చారు.

న్యాయమే గెలిచింది..

కేసు నడుస్తుండగా న్యాయస్థానాన్ని ధిక్కరించి నిర్మాణాలు తొలగించడంతో కోర్టు తప్పుపట్టిందని బాధితుడు, మాజీ ఉప సర్పంచ్ కటకం మహేశ్ తెలిపారు. రాజకీయ కక్షతో కావాలని నిర్మాణాలను కూల్చివేసి దాదాపు రూ.50 లక్షల వరకు నష్టం కలిగించారని పేర్కొన్నారు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని తెలిపారు.

ఈ-రేస్‌పై విచారణకు గవర్నర్ అనుమతి

- క్యాబినెట్‌లో పూర్తిస్థాయిలో చర్చ జరిపాం
- కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తారో, లేదో నాకు తెలియదు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఫార్ములా-ఈ రేస్‌పై విచారణకు గవర్నర్ అనుమతి ఇచ్చారని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. క్లియరెన్స్‌ను ఒకటిరెండు రోజుల్లో ఏసీబీకి పంపుతారని పేర్కొన్నారు. సోమవారం ఆయన అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ- రేస్‌పై క్యాబినెట్‌లో సమగ్రంగా చర్చించినట్టు తెలిపారు. ఈ-రేస్‌తో వచ్చిన పెట్టుబడుల లెక్కను ఏసీబీ తేలుస్తుందని స్పష్టం చేశారు. దీని వెనుక చాలా పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయని చెప్పారు. డబ్బును విదేశాలకు పంపితే కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుందని, ఆర్బీఐ అనుమతి కూడా అవసరమని తెలిపారు. ఈ అంశంలో అధికారులు సైతం విచారణ ఎదుర్కోవాల్సిందేనని చెప్పారు. ఐఏఎస్ అర్వింద్‌కుమార్‌పై విచారణకు ఇప్పటికే సీఎస్ అనుమతి ఇచ్చారని పేర్కొన్నారు. ఏజెన్సీల మీద కూడా కేసులు నమోదవుతాయని పేర్కొన్నారు. చట్టం తనపని తాను చేసుకుపోతుందని, కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తారో, లేదో తనకు తెలియదని పేర్కొన్నారు. అయితే, తాను చెప్పింది తుస్సు బాంబో, ఏ బాంబో త్వరలో తేలుతుందని వ్యాఖ్యానించారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఆర్వోఆర్ చట్టాన్ని సభలో పెడతామని తెలిపారు.

ఏ జిల్లానూ రద్దు చేయం

రాష్ట్రంలో ఏ కొత్త జిల్లానూ రద్దు చేసే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి లేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శాసనమండలిలో విపక్ష సభ్యులు కల్వకుంట్ల కవిత, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. మహబూబాబాద్ జిల్లా రద్దు అంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, కొడంగల్‌ను జిల్లాగా ఏర్పాటు చేసే ప్రతిపాదనా ప్రభుత్వం వద్ద లేదని పేర్కొన్నారు.

హైడ్రా అంటే ప్రజల్లో భయం లేదు

కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకత లేదని, ఉన్నా హైదరాబాద్‌కే అది పరిమితమని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోలేదని పేర్కొన్నారు. హైడ్రా అంటే ప్రజల్లో మొదట్లో భయం ఉండేదని, ఇప్పుడు నిజాలు తెలియడంతో భయం పోయిందని తెలిపారు. రాష్ట్రంలో భూమి లేని నిరుపేదలకు ఏటా రూ.12 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దాదాపు 15 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరే అవకాశం ఉంటుందని వివరించారు. ఇందుకు రూ. 1000 కోట్లు విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్టు చెప్పారు. ఏపీలో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడులు అమరావతికి వెళ్లాయనే అపోహ ఉండేదని, అయితే అమరావతిలో ఇటీవలి వరదలతో అందరూ వెనక్కి వస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు హైదరాబాద్, బెంగళూరుకు మాత్రమే పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. జనవరి తర్వాత రాష్ట్ర ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో కేసీఆర్ ముందు నిలబడి ప్రసంగించాలని తనకు వ్యక్తిగతంగా కోరిక ఉన్నదన్నారు. అదానీ విషయంలో తాము పార్టీ జాతీయ పాలసీని అమలు చేస్తామని చెప్పారు. నిబంధనలు దాటి అదానీకి సహకరించడాన్ని మాత్రమే రాహుల్‌గాంధీ వ్యతిరేకిస్తున్నారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లు అప్పులు చేయడం నిజమని మంత్రి పేర్కొన్నారు.

తప్పలేకున్నా నింద

ఫార్ములా ఈ- రేస్‌పై ప్రభుత్వం అత్యుత్సాహం

డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా కేటీఆర్‌పై అభియోగాలు

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాలనా లోపాలను ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ ప్రజల ముందు పెడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వం కుట్ర పన్నుతున్నది. ఎలాంటి తప్పూ లేకున్నా నిందవేసేందుకు ఉత్సాహ పడుతున్నది. ముఖ్యంగా ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగినప్పుడల్లా, ప్రభుత్వానికి పెద్ద సమస్య వచ్చినప్పుడల్లా డైవర్షన్ పాలిటిక్స్ కోసం ఈ-రేస్‌ను వాడుకుంటున్నది. తాజాగా ఈ-రేస్‌పై విచారణకు గవర్నర్ అనుమతి ఇచ్చారని ప్రభుత్వం తెలిపింది.

అసలేం జరిగిందంటే?

మోటారు కార్లు, వాహనాలు వెదజల్లే కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు ఉపయోగించాలని, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం, వీటిపై చైతన్యం కలిగించడం, పర్యావరణాన్ని కాపాడాలన్న లక్ష్యంతో ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లో ఫార్ములా ఈ-రేస్ నిర్వహిస్తుంటారు. అంతర్జాతీయ సంస్థ 'ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆటోమొబైల్' (ఎఫ్ఐఏ) ఈ ఫార్ములా ఈ-రేస్‌లు నిర్వహిస్తుంటుంది. మన దేశంలో మొదటిసారిగా ఈ పోటీలు నిర్వహించే అవకాశం తెలంగాణకు దక్కించుకున్నది. తద్వారా , షాంఘై, బెర్లిన్, మొనాకో, లండన్ వంటి నగరాల సరసన హైదరాబాద్ నిలిచింది. నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ కసరత్తుతో హైదరాబాద్‌కు ఆ అవకాశం దక్కింది. 2023 ఫిబ్రవరి 5-11వ తేదీ మధ్య ఈ-రేస్ 9వ సీజన్ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం ఇచ్చింది. అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమం యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

రేస్ కోసం హైదరాబాద్‌కు 31 వేల మంది

ప్రపంచవ్యాప్తంగా 150 దేశాల్లోని కార్ల ప్రేమికులు ఈ-రేస్‌ను ప్రత్యక్ష ప్రసారాలు, వివిధ మాధ్యమాల ద్వారా వీక్షించారు. 31 వేల మంది రేస్‌ను ప్రత్యక్షంగా చూసేందుకు హైదరాబాద్‌కు వచ్చారు. ఇదంతా అసెంబ్లీ ఎన్నికలకు ముందు జూన్ -జూలై మధ్య జరిగింది. అయితే, ఫిబ్రవరి నాటికి తాము స్పాన్సర్లను చూస్తామని, అప్పటివరకు హెచ్ఎండీఏ నుంచి రూ.50 కోట్లు నిర్వహణ కోసం కేటాయిస్తామని పురపాలక శాఖ మంత్రి హోదాలో కేటీఆర్ నిధులు విడుదల చేశారు. రేస్ నిర్వహణలో హెచ్ఎండీఏ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించింది. ఈ నిధులను రేస్ నిర్వహించే సంస్థ ఖాతాకే పంపించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫార్ములా ఈ-రేస్‌ను రద్దుచేసింది. దీంతో 2024 ఫిబ్రవరిలో జరగాల్సిన ఈ రేస్ రద్దయింది. రేస్ నిర్వహణ సంస్థ గతంలో హెచ్ఎండీఏ ఇచ్చిన నిధులను వెనక్కి ఇవ్వలేదు. రూ.50 కోట్ల నిధుల్లో నుంచి మంత్రి కేటీఆర్‌కో, బీఆర్ఎస్‌కో రూపాయి కూడా వెళ్లలేదు.

బాజాప్తా ఒప్పుక